# నమస్తే తెలంగాణ

# నాగర్‌కర్నూల్

3 | మహబూబ్‌నగర్, శనివారం 4 జనవరి 2025 | NAGARKURNOOL




సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

## మహిళా అభ్యున్నతికి సావిత్రీబాయి కృషి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, జనవరి 3 : దేశవ్యాప్తంగా పాఠశాలలు స్థాపించి మహిళలకు విద్యనందించి వారి అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రీబాయిపూలే అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సావిత్రీబాయి జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తన స్వగృహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలు, రుగ్మతలను రూపుమాపేందుకు అక్షరమే ఆయుధమని దేశవ్యాప్తంగా తొలి పాఠశాలలను స్థాపించి విద్యాబుద్ధులు అందించారన్నారు. సమాజ సేవా, విద్య, సాహిత్యంలో మహిళా అభ్యున్నతి కోసం సావిత్రీబాయి ఎంతో కృషి చేశారని అలాంటి మహనీయులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అయిజ : సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

## పూలే ఆశయాలను సాధించాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అయిజ, జనవరి 3 : విద్య ద్వారానే స్త్రీ విముక్తి లభిస్తుందని గ్రహించి బాలికలు, మహిళలకు విద్యనందించేందుకు కృషి చేసిన గొప్ప మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, తిక్కవీరేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సావిత్రీబాయిపూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నిళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి అని కొనియాడారు. ఆమెను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు, నాయకులు, అఖిల పక్ష కమిటీ నాయకులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్డీఎస్ @ ఎనిమిది అడుగులు



ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుత నీటి నిల్వ

- ఆనకట్ట ప్రధాన కాల్వకు నీళ్లు
- టీబీ డ్యాం నుంచి ఆర్డీఎస్‌కు కొనసాగుతున్న నీటి విడుదల
- సాగునీటి రాకతో హర్షం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు

అయిజ, జనవరి 3 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద కొనసాగుతున్నది. తుంగభద్ర జలాశయం నుంచి ఆర్డీఎస్ ఆనకట్టకు నీటి విడుదల కొనసాగుతుండడంతో ఇన్ ఫ్లో ఆనకట్టకు చేరుతున్నది. శుక్రవారం ఆర్డీఎస్‌కు 864 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 486 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, ఆర్డీఎస్ స్లూయిస్ రంధ్రాల గుండా దిగువకు 378 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నది. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8 అడుగుల మేర నీటి నిల్వ ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. టీబీ డ్యాం నుంచి జనవరి 5 వరకు నీటి విడుదల కొనసాగనుండగా, జనవరి 10 వరకు ఆర్డీఎస్ ఆనకట్టలో నీటిమట్టం నిలకడగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వ పెరుగుతున్న దృష్ట్యా ప్రధానకాల్వకు నీటి విడుదలను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని ఈఈ పేర్కొన్నారు.

***టీబీ డ్యాంలో నీటిమట్టం..***

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో స్వల్పంగా కొనసాగుతున్నది. శుక్రవారం ఇన్‌ఫ్లో 120 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 8,818 క్యూసెక్కులు నమోదైంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 79.334 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1,633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1625.86 అడుగులు ఉన్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## తిప్పారెడ్డిపల్లిలో అడవి జంతువు కలకలం

- చిరుతగా భావించిన రైతులు
- గోల్డెన్ జాకిల్‌గా గుర్తించిన ఫారెస్టు అధికారులు

వంగూరు, జనవరి 3 : మండలంలోని తిప్పారెడ్డిపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున రైతు బద్దుల లింగమయ్య అనే రైతు పొలంలో చిరుత సంచరిస్తుండగా చూశానని ఆ గ్రామ రైతు కిశోర్‌రావు తెలిపారు. భయాందోళనకు గురైన రైతులు వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామానికి వచ్చిన ఫారెస్టు అధికారులు చిరుత సంచరించిందని భావించిన రైతు లింగమయ్య పొలంలో జంతువు కాలిముద్రలను పరిశీలించారు. అయితే ఇది చిరుత కాదని చిరుత రూపంలో వున్న గోల్డెన్ జాకిల్ అని నిర్ధారించారు. ఈ జంతువు రైతుల పశువులు, దూడలను పట్టి తింటుందన్నారు. పశువుల మాంసం, రక్తం దొరకకపోతే గోల్డెన్ జాకిల్ ఆ ప్రాంతాన్ని వదిలిపోతుందన్నారు. రైతులు తమ పశువులను వారం పాటు వ్యవసాయ పొలాల్లో కాకుండా తమ ఇండ్ల వద్దే కట్టేసి ఉంచుకోవాలని ఫారెస్టు అధికారులు సూచించారు.



తిప్పారెడ్డిపల్లిలో సంచరించిన జంతువు కాలి ముద్ర



బీచుపల్లి గురుకులం గేటు వద్ద బైఠాయించి నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

## ప్రిన్సిపాల్ మాకొద్దు..

- మా సమస్యలను ఆలకరించరూ..
- అధికారులకు విద్యార్థుల విజ్ఞప్తి
- బీచుపల్లి గురుకులం వద్ద ధర్నా
- ఎస్సై హామీతో విరమణ

అలంపూర్/ఎర్రవల్లి చౌరస్తా, జనవరి 3 : విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే ఆ ప్రిన్స్‌పాల్ మాకొద్దని విద్యార్థులు మరోమారు రోడ్డెక్కిన ఘటన ఎర్రవల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే ఎర్రవల్లి మండలం బీచుపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు కొంతకాలంగా విధులను నిర్లక్షంగా వ్యవహరిస్తున్నాడని, ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని, ముఖ్యంగా చదువు, భోజన మెనూ విషయంలో పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే పదిహేను రోజుల కిందట గురుకుల పాఠశాల నుంచి సుమారు 19 కిలో మీటర్లు కాలినడకన జిల్లా కేంద్రానికి వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన విషయం విధితమే. కలెక్టర్ ఆదేశాల మేరకు నిజనిర్ధారణ కమిటీ సభ్యులు గురువారం గురుకుల పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించి నివేదికలు ఉన్నతాధికారులకు అందజేశారు. అయితే మరుసటి రోజు కూడా గతంలో మాదిరిగానే ప్రిన్సిపాల్ శ్రీనివాసులు యథావిధిగా విధులకు హాజరు కావడంతో అధికారుల తీరులో ఏ మాత్రం మార్పులు జరగలేదని విద్యార్థులు గమనించిన విద్యార్థులు ప్రిన్సిపాల్ చర్యలు తీసుకోలేదనే నెపంతో ఉన్నట్టుండి మరో మారు గురుకుల పాఠశాల ఎదుట ఉన్న 44వ జాతీయ రహదారిపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల సిబ్బంది కలుగజేసుకుని విద్యార్థులకు నచ్చజెప్పి పాఠశాలలోకి తీసుకెళ్లారు. అయితే ఈ ఘటన జిల్లాలో వైరల్‌గా మారింది. ఇకనైనా అధికారులు చొరవ చూపి మా సమస్యలకు పరిష్కారం చూపెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అధికారులు తీరుకు అద్దం పట్టేలా ఈ ఘటన ఉందని ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు.



*న్యూ ఇయర్ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుట్ల తారక రామారావును హైదరాబాద్‌లోని స్వగృహంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.*

*– మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 3*

### కష్టం మాది.. ఫలితం మరొకరిదా..?



ఆరేళ్లుగా ఎంతో కష్టపడి ప్రతి రోజు ప్రాక్టీస్ చేస్తూ వాలీబాల్ ఆడుతున్నా.. అమ్మానాన్నల ఆశయ సాధనలో భాగంగా ముందుకు అడుగులు వేస్తున్నా.. ఎస్‌జీఎఫ్ అండర్-19లో నా వంతుగా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించా.. అన్ని మ్యాచ్‌లలో కష్టపడ్డా.. కష్టం మాది.. ఫలితం వేరేవారికి అంటే మనసొప్పడం లేదు. క్రీడాస్ఫూర్తిని చాటాలని అనుకున్నా.. ప్రతిభ ఆధారంగా ఎంపిక జరిగితే బాగుంటుందని భావిస్తున్నా. ఫైనల్ జాబితాలో పేరు తారుమారు చేయడం చాలా బాధగా ఉంది. కలెక్టర్, అధికారులు న్యాయం చేయాలి.

**- సింగనమోని కీర్తి, టీజీ ఆర్‌జేసీ బాలానగర్**


### సెలెక్ట్ అన్నారు.. పేరు మార్చారు..



కరీంనగర్‌లో నిర్వహించే అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి సెలెక్ట్ అయ్యావని సారోళ్లు చెప్పారు. కానీ నాకు అవకాశం కల్పించలేదు. మాదీ ఖిల్లాఘణపురం మండలం మానాజీపేట. అమ్మానాన్న నాగమ్మ, మల్లన్న నన్ను కష్టపడి ఇంతదూరం పంపించి ఉన్నతస్థాయిలో రాణించాలనే తలంపుతో కృషి చేస్తున్నారు. మాలో ఉన్న ప్రతిభను ప్రోత్సహించాల్సిన వారే ఇలా చేయడం విచిత్రంగా ఉంది. కాళ్లు, చేతులకు దెబ్బలు తగిలి, గాయాలు బాధిస్తున్నా.. కడుపు మాడ్చుకుని కష్టపడ్డాం. ఇప్పుడు ఇలా చేయడం సరికాదు..

**- నందిని, టీజీ ఆర్‌జేసీ, బాలానగర్**

### అర్హులకు న్యాయం చేస్తాం



ఎస్‌జీఎఫ్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టిన వాలీబాల్ అండర్-19లో ఫైనల్ జాబితాలో పేరు తారుమారు విషయంపై మాకు ఫిర్యాదులు అందాయి. వాటిపై సంబంధిత నిర్వాహకులు, ఫిజికల్ డైరెక్టర్లతో సంప్రదింపులు జరుపుతున్నాం. అర్హులైన క్రీడాకారులకు న్యాయం జరిగేలా చూస్తాం.

**- శ్రీనివాస్, జిల్లా క్రీడల నిర్వహణాధికారి, మహబూబ్‌నగర్**



వాలీబాల్ అండర్-19 క్రీడా జట్టు (ఫైల్)

## పైరవీలకు పెద్దపీట!

- ఎస్‌జీఎఫ్ క్రీడల్లో పేద క్రీడాకారిణులకు మొండిచేయి?
- క్రీడల్లో సత్తా చాటి జాతీయ స్థాయికి ఎంపికైన పలువురు..
- జట్టు తుది జాబితాలో పేర్లు తారుమారుతో షాక్..
- ఆందోళన వ్యక్తం చేస్తున్న టీజీఆర్‌జేసీ విద్యార్థినులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 3 : పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే ఆటల పోటీల్లో సత్తా చాటి ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన క్రీడాకారులకు మొండిచేయి చూపుతున్నారు. పైరవీలకు కొందరు అధికారులు, సిబ్బంది పట్టం కడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాపాలన ప్రభుత్వంలో క్రీడల్లోనూ ప్రతిభావంతులకు అన్యాయం జరుగుతుందని పలువురు క్రీడాకారులు వాపోతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో గండుమాల్ మండల కేంద్రంలోని ఏకే స్పోర్ట్స్ అకాడమీ క్రీడా మైదానంలో డిసెంబర్ 9 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్రస్థాయి అండర్-19 పోటీలు జరిగాయి. ఈ టోర్నీలో రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల క్రీడాకారులతో పాటు దేశ నలుమూలల నుంచి (21 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ఏడు కేంద్ర విద్యా సంస్థలకు చెందిన) 32 జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నీలో సత్తా చాటిన ఎందరో క్రీడాకారుల పేర్లు తుది జాబితాల్లో తారుమారు అయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**పేద క్రీడాకారిణులకు మొండిచేయి**

ఈ పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లోని టీజీ ఆర్‌జేసీ గురుకుల విద్యాలయం విద్యార్థినులు పాల్గొని సత్తాచాటారు. టీజీ ఆర్‌జేసీ విద్యార్థిని కీర్తి జాతీయ అండర్-19 వాలీబాల్ జట్టులో స్థానం సంపాదించినట్లు పర్యవేక్షకులు, సెలెక్షన్ కమిటీ సభ్యులు రాతపూర్వకంగా ఈనెల 12న ఫైనల్ జాబితా ప్రకటించారు. సదరు విద్యార్థిని పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులంతా అభినందించారు. కీర్తి తాను జాతీయ జట్టులో ఆడేందుకు ఎంపికైనట్లు తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించి తన సంతోషాన్ని పంచుకున్నది. ఈ నేపథ్యంలోనే అధికారులు వెల్లడించిన ఆన్‌లైన్ జాబితాలో తన పేరు లేకపోవడాన్ని షాక్‌కు గురైంది. ప్రతిభావంతురాలైన క్రీడాకారిణికి మొండిచేయి చూపి ఆన్‌లైన్‌లో మరో క్రీడాకారిణి పేరును ఫైనల్ జాబితాలో చేర్చారు. అండర్-17 లోనూ తనకు అన్యాయం జరిగినట్లు మరో క్రీడాకారిణి నందిని తెలిపింది.

మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూరు మండలం వేములలో నిర్వహించిన క్రీడల్లో సత్తాచాటిన ఆమెకు కరీంనగర్ జిల్లాలో నిర్వహించే పోటీలకు ఎంపికైనట్లు ముందుగా పేరు ప్రకటించినా.. ఆ తర్వాత పేరును తొలగించినట్లు వాపోయింది. వీరితోపాటు మరికొందరి పేర్లు గల్లంతైనట్లు సమాచారం. అయితే మా పేర్లు తొలగించి ఇతరుల పేర్లు చేర్చిన క్రీడాకారులు అసలు మైదానంలో బరిలోకే దిగలేదని పలువురు క్రీడా కారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ పాపిరెడ్డిని ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదు.

## పోలీసులు సమాజసేవకు పాటుపడాలి


- మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ



పదోపటాలంలో పోలీసు సిబ్బందికి మెమెంటో అందస్తున్న మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ

ఎర్రవల్లి చౌరస్తా, జనవరి 3 : పోలీసులు అనునిత్యం సమాజసేవకు పాటుపడాలని మల్టీజోన్ ఐజీ వీ.సత్యనారాయణ సూచించారు. శుక్రవారం పదోపటాలం కమాండెంట్ ఎన్‌వీ సాంబయ్య ఆధ్వర్యంలో నిజామాబాద్, ములుగు, హైదరాబాద్ జిల్లాలకు చెందిన టీజీఎస్పీ రిక్రూట్ కానిస్టేబుళ్ల పదోపటలంలో ఏర్పాటు చేసిన దీక్షాంత్‌పరేడ్(పాసింగ్ ఔట్ పరేడ్)కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ 9నెలల కఠోర శిక్షణను పూర్తిచేసుకొన్న ములుగు, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 522 మంది రిక్రూట్ కానిస్టేబుళ్లు పాసింగ్ ఔట్ పరేడ్‌కు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసిన వీరంతా నేటి నుంచి పోలీసు కుటుంబ విధుల్లోకి వస్తున్నందుకు ముందుగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు ఉద్యోగం ఎప్పుడూ సవాళ్లు, త్యాగాలతో ముడిపడి ఇతర శాఖలకు భిన్నంగా ఉంటుందన్నారు. అయినప్పటికీ ప్రజలు ఎల్లప్పుడు పోలీసు నుంచి ఇంకా సేవలు కావాలని కోరుకుంటారని, ఆ దిశగా మనం వారి అంచనాలను అందుకునేలా సేవలు అందించాలని సూచించారు. పదోపటాలంలో రిక్రూట్‌మెంట్ కుటుంబసభ్యుల సమక్షంలో 522 మందితో నిర్వహించిన దీక్షాంత్ పరేడ్ కనులపండవగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం పరేడ్‌కమాండర్ అవుట్‌డోర్ ఇండోర్ ఫైరింగ్ ఆల్‌రౌండర్లకు శిక్షణ అందించిన అధికారులకు ఐ జీ, ఎస్పీ శ్రీనివాసరావు, పదోపటాలం కమాండెంట్ సాంబయ్య మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఫణి పాల్గొన్నారు.

## వెట్టిచాకిరి నుంచి చెంచుదంపతులకు విముక్తి




చెంచుదంపతులకు డీడీ అందజేస్తున్న న్యాయమూర్తులు


అచ్చంపేట, జనవరి 3 : అచ్చంపేట మండలం గుంపన్‌పల్లి గ్రామానికి చెందిన చెంచు దంపతులకు చెంచు పలుగుతండాకు చెందిన వ్యక్తి రూ.15వేలు అప్పుగా ఇచ్చి వారితో మూడేండ్లుగా వ్యవసాయ పొలంలో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాడు. ఈ విషయం సోషల్ మీడియా ఇతర మార్గాల ద్వారా హైకోర్టు పరిగణలోకి తీసుకున్నది. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని సూచించడంతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న వ్యక్తిపై గత నెల 13న కేసు నమోదు చేశారు. 14న దంపతులకు వెట్టి నుంచి విముక్తి కల్పించారు. విముక్తి పొందిన చెంచు దంపతులకు జీవనోపాధి కోసం శుక్రవారం జిల్లా ప్రధానన్యాయమూర్తులు రాజేశ్‌బాబు, సబిత, అచ్చంపేట జడ్జి విజయ్‌కుమార్ ప్రభుత్వం తరపున రూ.60 వేల ఆర్థికసాయం డీడీ రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మాధవి, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ తదితరులు పాలొన్నారు.

## బిర్యానీలో బొద్దింక

- చికెన్ బిర్యానీలో ప్రత్యక్షమవడంతో అవాక్కైన కస్టమర్
- ఇదేమని అడిగితే దబాయించిన ప్రశాంత్ హోటల్ యజమాని
- ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు




కస్టమర్‌తో వసూలు చేసిన బిల్లు



బిర్యానీలో వచ్చిన బొద్దింక

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జనవరి 3 : జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకుడికి చెందిన ప్రశాంత్ హోటల్‌లో శుక్రవారం బిర్యానిలో బొద్దింక రావడం కలకలం రేపింది. చికెన్ బిర్యాని తింటున్న కస్టమర్ చివరిలో బొద్దింకను చూసి షాకయ్యాడు. ఇదేంటని హోటల్ సర్వెంట్‌ను నిలదీయగా.. తన యజమానికి విషయాన్ని తెలియజేశాడు. యజమాని వచ్చి ఇలాంటి చిన్న వాటిని పట్టించుకోవద్దని బిల్లు చెల్లించాల్సిందే.. అంటూ దబాయించి వినియోగదారుడుతో బిల్లు కట్టించుకొని తోసేశారు. దీంతో బిర్యానిలో వచ్చిన బొద్దింకను వినియోగదారుడు ఫొటో తీసుకుని నేరుగా జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అనంతరం వినియోగదారుల ఫోరంలో కూడా ఫిర్యాదు చేస్తానని వెల్లడించాడు. కల్తీ, అపరిశుభ్రంతో ప్రతి రోజు హోటళ్లపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారని వినియోగదారులు మండిపడారు.

## ఉపాధ్యాయులపై ట్రాఫిక్ కానిస్టేబుల్ దాడి

- రాంగ్ రూట్లో వచ్చారంటూ హెల్మెట్‌తో దురుసు ప్రవర్తన
- కానిస్టేబుల్‌పై బాధితుల ఫిర్యాదు
- విధులకు ఆటంకం కలిగించాలని టీచర్లపై కానిస్టేబుల్ ఫిర్యాదు

మహబూబ్‌నగర్, జనవరి 3 : నిబంధనలకు ఉల్లఘించి బైక్‌పై రాంగ్‌రూట్లో వచ్చారని ట్రాఫిక్ కానిస్టేబుల్ అసభ్య పదజాలంతో ఉపాధ్యాయ దంపతులపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా హెల్మెట్‌తో దాడి చేసిన ఘటన మహబూబ్‌నగర్‌లో చోటు చేసుకున్నది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మద్దూర్ మండలంలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడు, కోయిలకొండలో ఉపాధ్యాయురాలుగా పనిచేసే తన భార్యను బైక్‌పై ఎక్కించుకొని గురువారం సాయంత్రం పాతబస్టాండ్ సమీపంలో మ్యాక్స్ షోరూం ముందు నుంచి ఇంటికి వస్తున్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో వారు రాంగ్‌రూట్లో వస్తుండగా అక్కడ విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ యాదయ్య వీరిని పట్టుకొని అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో ఎందుకు దూషిస్తున్నారని కానిస్టేబుల్‌ను వారు ప్రశ్నించగా మళ్లీ దురుస్తుగా వ్యవహరించడమే కాకుండా ఉపాధ్యాయుడి బైక్‌కు ఉన్న హెల్మెట్ తీసుకొని దాడి చేశాడు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకున్నది. వీరి మధ్య జరిగిన తోపులాటలో మహిళా ఉపాధ్యాయురాలు కిందపడింది. సమాజంలో విద్యాబుద్ధులు నేర్పుతున్న మమ్మల్నే ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ గౌరవం లేకుండా వ్యవహరించి దాడి చేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి నందుకు సదరు కానిస్టేబుల్ బైక్ ఫొటో తీసి చలానా విధించే అవకాశం ఉన్నా అలా చేయకుండా దాడి చేయడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో సదరు కానిస్టేబుల్‌పై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ అప్పయ్యకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా కానిస్టేబుల్ యాదయ్య కూడా విధులకు ఆటంకం కలిగించిన టీచర్‌పై ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐని వివరణ కోరగా ఇద్దరి ఫిర్యాదులపై ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## కందులు @ రూ. 8,721

నారాయణపేట టౌన్, జనవరి 3 : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం 455 క్వింటాళ్ల తెల్ల కందులు విక్రయానికి రాగా, క్వింటా గరిష్ఠంగా రూ.8,721, కనిష్ఠంగా రూ.6వేల ధర పలికింది. 2,217 క్వింటాళ్ల ఎర్ర కందులు విక్రయానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.8,706, కనిష్ఠంగా రూ. 3వేల ధర పలికాయి. 211 క్వింటాళ్ల సోనరకం ధాన్యం విక్రయానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.2,493, కనిష్ఠంగా రూ.1,830 ధర పలికినట్లు యార్డు సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు.